క్లుప్తంగా

బలరాంనాయక్‌ను గెలిపించాలి



మాట్లాడుతున్న బిక్షమయ్య

అశ్వాపురం: ఈ నెల 13న జరగబోయే పార్లమెంట్ ఎన్నికల్లో ఇండియా కూటమి అభ్యర్థి పోరిక బలరాంనాయక్‌ను గెలిపించేందుకు అశ్వాపురం నాయకులు కృషి చేయాలని అశ్వాపురం మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఓరుగంటి బిక్షమయ్య అన్నారు. బుధవారం పార్టీ కార్యాలయంలో జరిగిన అఖిలపక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు.. కాంగ్రెస్ మానుకోట ఎంపీ అభ్యర్థి బలరాంనాయక్ చేసిన అభివృద్ధిని వివరించారు. గురువారం 10 గంటలకు జరిగే సమావేశానికి హాజరవ్వాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఎంపీపీ ముత్తినేని సుజాత, సీపీఐ మండల కార్యదర్శి అనంతనేని సురేశ్, టీడీపీ మండల అధ్యక్షుడు తుళ్లూరి ప్రకాశ్, మండెపూడి సాంబశివరావు, పగడాల కరుణాకర్‌రెడ్డి, సూరకంటి ప్రభాకర్‌రెడ్డి, షరీఫుద్దీన్, ఏనిక రవి, గాదె కేశవరెడ్డి, బచ్చు వెంకటరమణ, ఓరుగంటి రమేశ్‌బాబు, బట్టా సత్యనారాయణ, లంకెమళ్ల కొండల్‌రావు, చెంచల రాము, రాయపూడి రాజేశ్, గొల్లపల్లి నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక



మంత్రి పొంగులేటితో నాయకులు

చండ్రుగొండ: బీఆర్‌ఎస్ నాయకుడు తాళ్లూరి వెంకటేశ్వరరావు బుధవారం ఖమ్మంలో రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సమక్షాన కాంగ్రెస్‌లో చేరారు. ఆయనతో పాటు ఎంపీటీసీ లంకా విజయలక్ష్మి, బొల్లెపోగు నాగేశ్, వాసం కన్నమ్మ తదితరులు కూడా కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. తొలినాళ్లలో సీపీఐ (ఎంఎల్) పార్టీలో పనిచేసిన వెంకటేశ్వరరావు, ఆ తర్వాత టీడీపీలో చేరి పార్టీ జిల్లా అధ్యక్షుడిగా, డీసీసీబీ డైరెక్టర్‌గా, భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్‌గా పనిచేశారు. అనంతరం టీఆర్‌ఎస్‌లో చేరినప్పటికీ అప్పై బయటకు వచ్చి కోదండరాం నాయకత్వంలో టీజేఎస్‌లో కొంతకాలం పనిచేశారు. మళ్లీ అసెంబ్లీ ఎన్నికల ముందు బీఆర్‌ఎస్‌లో చేరి, ఇప్పుడు కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు.

ఆర్థిక సాయం అందజేత



ఆర్థిక సాయం అందిస్తున్న నాయకులు

ములకలపల్లి: వడదెబ్బతో మృతి చెందిన కుటుంబానికి బుధవారం స్థానిక సీపీఐ నాయకులు ఆర్థిక సాయం అందించారు. ములకలపల్లికి చెందిన సీపీఐ నాయకుడు కంపాటి పుల్లయ్య (70) పొలం పనులు చేస్తూ వడదెబ్బకు గురై మృతి చెందాడు. విషయం తెలుసుకున్న సీపీఐ నాయకులు పుల్లయ్య మృతదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో నాయకులు నరాటి ప్రసాద్, ఎండీ యూసుఫ్, నరాటి రమేశ్, అనుముల సాయి, పువ్వాల లలితారావు, గొడ్ల చిన్నకొండయ్య పాల్గొన్నారు.

పెద్దతోగు గ్రామంలో వైద్యపరీక్షలు



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

గుండాల: మలేరియా ప్రభావితమైన పెద్దతోగు గ్రామంలో బుధవారం మలేరియా జిల్లా అధికారి ఆదేశాల మేరకు వైద్యసిబ్బంది ఆధ్వర్యంలో స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. ఆ గ్రామంలో 117 మంది నుంచి రక్త పూతలు సేకరించి లేబొరేటరికి పంపించామని సీహెచ్‌ఓ శ్రీహరి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రానున్న రోజుల్లో సీజనల్ వ్యాధులను అరికట్టేందుకు ఈ సర్వే ఎంతగానో ఉపయోగపడుతుందని, మలేరియా ప్రభావిత గ్రామాల్లో జ్వరం ఉన్నప్పటికీ బయటపడదని, రక్త పరీక్షల ద్వారా గుర్తిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఎస్‌యూఓ బద్రు, ఎంటీఎస్ పి.సత్యం, హెల్త్ అసిస్టెంట్లు వీర రాఘవులు, రమేశ్, ఆశావర్కర్ సరస్వతి పాల్గొన్నారు.

ఘనంగా మే డే

బానిస బతుకులకు చరమగీతం పాడిన రోజే మేడే అని పలువురు వక్తలు పేర్కొన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా 138వ మేడే వేడుకలను వివిధ రాజకీయ పార్టీలు, కార్మిక, కర్షక సంఘాల ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. తొలుత కార్యాలయాల ఎదుట నాయకులు ఎర్ర జెండా ఎగురవేసి అమరవీరుల త్యాగాలను కొనియాడారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ వెట్టిచాకిరీకి విముక్తి లభించిన రోజునే మేడేగా జరుపుకుంటున్నామన్నారు. ఇందుకోసం పోరాడి ప్రాణాలు కోల్పోయిన కార్మికుల సేవలు మరువలేనివని కొనియాడారు. వారిని స్ఫూర్తిగా తీసుకుని కార్మికుల హక్కులను సాధించేందుకు పోరాటం సాగించాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. -సాక్షి నెట్‌వర్క్



అశ్వారావుపేటరూరల్: ర్యాలీ నిర్వహిస్తున్న ఆశా వర్కర్ల యూనియన్ (సీఐటీయూ) సభ్యులు



కరకగూడెం: జెండా ఎగురవేస్తున్న కార్మికులు



మణుగూరురూరల్: ఇఫ్టూ ఆధ్వర్యంలో..



మణుగూరుటౌన్: ఉద్యమకారులను సన్మానిస్తున్న టీబీజీకేఎస్ ఇన్‌చార్జ్ వెంకట్



భద్రాచలంఅర్బన్: మేడే సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం నాయకుడు



అశ్వాపురం: జెండా ఆవిష్కరిస్తున్న ఏఐటీయూసీ నాయకులు



గుండాల: జెండా ఎగురవేస్తున్న ఎన్డీ నాయకులు



అన్నపురెడ్డిపల్లి: అరుణ పతాకం ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు



దమ్మపేట: మేడే వేడుకల్లో జీసీసీ కార్మికులు



చండ్రుగొండ: సీఐటీయూ ఆధ్వర్యంలో..



బూర్గంపాడు: జెండా ఎగురవేస్తున్న నాయకులు



చర్ల: ఏఐటీయూసీ ఆధ్వర్యంలో



దుమ్ముగూడెం: సీపీఎం ఆధ్వర్యంలో



అశ్వారావుపేటరూరల్: మాస్‌లైన్ ఆధ్వర్యంలో..



ములకలపల్లి: ఏఐటీయూసీ ఆధ్వర్యంలో..



భద్రాచలంటౌన్: ఆర్టీసీ డిపో వద్ద..



గుండాల: ప్రజాపంథా ఆధ్వర్యంలో..

కేసీఆర్‌ను కలిసిన నాయకులు



కేసీఆర్‌తో శ్రీలత, భార్గవి

బూర్గంపాడు: మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను పినపాక నియోజకవర్గానికి చెందిన ప్రజాప్రతినిధులు బుధవారం కలిశారు. కొత్తగూడెంలోని ఇల్లెందు సింగరేణి గెస్ట్‌హౌస్‌లో బసచేసిన మాజీ సీఎం కేసీఆర్‌ను బూర్గంపాడు జెడ్పీటీసీ సభ్యురాలు కామిరెడ్డి శ్రీలత, ఆళ్లపల్లి ఎంపీపీ కొండ్రు భార్గవి, బీఆర్‌ఎస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ జలగం జగదీశ్, పాలం దివాకర్‌రెడ్డి, యారం పున్నారెడ్డి కలిశారు.

'పది'లో టాపర్‌కు సన్మానం



ఆఫియాకు సన్మానం చేస్తున్న స్థానికులు

చండ్రుగొండ: పదో తరగతి పరీక్షల్లో 9.5 జీపీఏ సాధించి మండల టాపర్‌గా నిలిచిన మహ్మద్ ఆఫియాకు బుధవారం పౌరసన్మానం చేశారు. లారీడ్రైవర్ అయిన మహ్మద్ జావీద్ కుమార్తె అయిన ఆఫియా చండ్రుగొండలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదివింది. ప్రభుత్వ పాఠశాలలో చదువుతూ ప్రతిభ చూపిన ఆమెను అభినందించారు. కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టు ఎంఏ వాహెద్, ఎండీ ఖాజాహుసేన్, ఎస్కే అన్వర్, యండీ అష్రఫ్ పాల్గొన్నారు.

విద్యార్థినికి అభినందన

మణుగూరురూరల్: మున్సిపాలిటీ పరిధిలోని చినరావిగూడెం గ్రామానికి చెందిన తెల్లం భార్గవి ఇటీవల విడుదల చేసిన పదో పరీక్ష ఫలితాల్లో 9.2 జీపీఏ సాధించగా భద్రాచలం గిరిజన గురుకుల పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం.దేవదాసు అభినందించారు. ఆమె పాఠశాలలో టాపర్‌గా నిలిచింది.

చేతి పంపు బాగుచేయండి..

దుమ్ముగూడెం: మండలంలోని లక్ష్మీనగరంలోని కమ్మ బజార్ జంక్షన్‌లో ఉన్న చేతిపంపు కొన్నేళ్లుగా పని చేయకుండా ఉంది. దీనికి మరమ్మతులు చేసి ఉపయోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు. ఈ ఎండాకాలం విపరీతంగా ఎండలు ఉండటంతో మిషన్ భగీరథ నీళ్లు కూడా అరకొరగా వస్తున్నాయి. అధికారులు దృష్టి పెట్టి చేతి పంపుకు మరమ్మతులు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

క్రీడల్లో 'వ్యవసాయ' విద్యార్థుల ప్రతిభ



పోటీల్లో పాల్గొన్న విద్యార్థులతో అధ్యాపకులు

అశ్వారావుపేటరూరల్: ఖమ్మం జిల్లా టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల్లో అశ్వారావుపేట వ్యవసాయ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్లు కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ హేమంత్‌కుమార్ తెలిపారు. బుధవారం డీన్ ఆధ్వర్యంలో క్రీడా పోటీల్లో సత్తా చాటిన విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత నెల 28 నుంచి 30వ తేదీ వరకు టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో జరిగిన పోటీల్లో కళాశాల నుంచి విద్యార్థులు పాల్గొన్నారని, మహిళల డబుల్స్ విభాగంలో అమృత వర్షం, యమున ద్వితీయ స్థానం, సింగిల్స్ విభాగంలో హలావత్ చిన్నారి తృతీయ స్థానం కైవసం చేసుకున్నట్లు చెప్పారు. అలాగే పురుషుల డబుల్స్ విభాగంలో అబ్రహం, చంద్రశేఖర్ తృతీయ స్థానం దక్కించుకున్నారని చెప్పారు. కార్యక్రమంలో డాక్టర్ మధుసూదన్‌రెడ్డి, పీడీ రెహ్మాన్ ఉన్నారు.

కాంగ్రెస్ పార్టీతోనే దేశ ప్రగతి

కరకగూడెం: కాంగ్రెస్ పార్టీతోనే దేశ ప్రగతి సాధ్యమని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం ఆయన పినపాక, కరకగూడెంలో పార్టీ కార్యకర్తలతో పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించి మాట్లాడారు. తెలంగాణ ఉద్యమాన్ని గౌరవించి సోనియాగాంధీ తెలంగాణ రాష్ట్రం ఇస్తే కేసీఆర్ రెండుసార్లు గెలిచి ప్రజలను మోసం చేశారన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం పేపర్ లీకేజీలకు పాల్పడుతూ నిరుద్యోగుల జీవితాలతో చెలగాటం ఆడిందని, అందుకే ప్రజలు కాంగ్రెస్‌ను గెలిపించారని, పార్లమెంట్ ఎన్నికల్లోనూ పోరిక బలరాంనాయక్‌ను గెలిపించాలని కోరారు. మత విద్వేషాలు రెచ్చగొడుతున్న బీజేపీకి ఓటుతో బుద్ధి చెప్పాలని సూచించారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

కార్యక్రమాల్లో బలరాంనాయక్ తనయుడు పోరిక శంకర్, టీపీసీసీ సభ్యులు చందా సంతోష్, సీపీఐ రాష్ట్ర నాయకులు అయోధ్య, సయ్యద్ ఇక్బాల్‌హుస్సేన్, రామనాథం పాల్గొన్నారు.

బీజేపీ ఎన్నికల ప్రచారం

ములకలపల్లి: బీజేపీ ఖమ్మం పార్లమెంట్ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు గెలుపు కోరుతూ బుధవారం విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. వినోద్‌రావు మేనకోడలు తాండ్ర అనిత ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని ఇంటింటికీ వెళ్లి ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు అనుముల శ్రీనివాస్, శనగపాటి సీతారాములు, భాను, అత్యం సాయి, శనగవరపు రాము పాల్గొన్నారు.

ఉచితంగా మజ్జిగ పంపిణీ



మజ్జిగ పంపిణీ చేస్తున్న వ్యాపారి

మణుగూరుటౌన్: అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్న నేపథ్యంలో పట్టణంలోని సప్తగిరి సూపర్ మార్కెట్ వ్యాపారి స్వచ్ఛందంగా బాటసారులకు, వాహనచోదకులకు, లారీడ్రైవర్లకు బుధవారం ఉచిత మజ్జిగ పంపిణీ చేశారు. సింగరేణి ఓపెన్‌కాస్ట్‌ల నేపథ్యంలో 40కి మించి ఉష్ణోగ్రతలు నమోదవుతున్న నేపథ్యంలో ప్రజలు బయటకు రావాలంటే జంకుతున్నారు. ఈ క్రమంలో బయటకు వచ్చినవారికి ఉచితంగా మజ్జిగ పంపిణీ చేశారు. వ్యాపారికి పలువురు ధన్యవాదాలు తెలిపారు.


ఎన్నికల నిర్వహణపై పీఓలు, ఏపీఓలకు శిక్షణ



మాట్లాడుతున్న ఏఆర్‌ఓ దామోదర్‌రావు

భద్రాచలంఅర్బన్: పార్లమెంట్ ఎన్నికల విధులకు హాజరయ్యే పీఓలు, ఏపీఓలు ఎలాంటి లోటుపాట్లు లేకుండా పనిచేయాలని ఏఆర్‌ఓ దామోదర్‌రావు సూచించారు. మంగళవారం పట్టణంలోని ప్రభుత్వ కళాశాలలో నిర్వహించిన పోలింగ్ అధికారుల శిక్షణ తరగతులను ఆయన పరిశీలించారు. ఈవీఎం మిషన్ వాడకంపై అవగాహన కల్పించారు. మే 13న జరిగే పోలింగ్‌ను ఏవిధంగా నిర్వహించాలో శిక్షణ ఇచ్చారు. అనంతరం మాట్లాడుతూ విధుల్లో నిరంతరం అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. ఆయన వెంట భద్రాచలం తహసీల్దార్ శ్రీనివాస్, డీటీ మణిధర్ పాల్గొన్నారు.

దుర్గాప్రసాద్‌కు గౌరవ డాక్టరేట్



అవార్డు అందుకుంటున్న దుర్గాప్రసాద్

బూర్గంపాడు: నాగినేనిప్రోలు రెడ్డిపాలెం గ్రామానికి చెందిన గాయకుడు కోట దుర్గాప్రసాద్‌కు చెన్నై తెలుగు సంస్కృతి సాహితీ సేవా ట్రస్ట్ గౌరవ డాక్టరేట్‌ను అందించింది. సినీ గాయకులు ఘంటసాల, బాలసుబ్రహ్మణ్యం, జేసుదాస్ పాటలను తెలుగు, తమిళం, హిందీ భాషల్లో పాడుతూ పలువురి మన్ననలు పొందిన దుర్గాప్రసాద్‌కు సంస్థ గౌరవడాక్టరేట్‌తో సత్కరించింది. వృత్తిరీత్యా టీవీ మెకానిక్‌గా జీవనం సాగిస్తూ తన గాత్రంతో పలు కార్యక్రమాల్లో అందరినీ ఆకట్టుకుంటున్నాడు. ఇప్పటి వరకు ఎన్నో అవార్డులు ఆయన అందుకున్నారు. కాగా, దుర్గాప్రసాద్‌ను భద్రాచలం, కొత్తగూడెంలకు చెందిన పలు సాంస్కృతిక సంస్థలు అభినందించాయి.

వైద్య ఆరోగ్యశాఖ అధికారుల తనిఖీలు



పండ్ల రసాన్ని పరిశీలిస్తున్న వైద్యారోగ్యశాఖాధికారి

చర్లరూరల్: స్థానిక నీటి శుద్ధి కేంద్రాలను వైద్య ఆరోగ్యశాఖ అధికారులు బుధవారం తనిఖీ చేశారు. వేసవికాలం దృష్ట్యా శరీర నొప్పులతో కూడిన జ్వరాలతో పాటు గ్రామాల్లో నీటి ద్వారా టైఫాయిడ్, గవద బిళ్లలు, విరేచనాలు ఎక్కువగా నమోదవుతున్న నేపథ్యంలో కొయ్యూరు పీహెచ్‌సీ వైద్యాధికారి ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టారు. నీటి శుద్ధి కేంద్రాల వద్ద పరిశుభ్రంగా ఉండాలని, నీటి క్యాన్లు ఎప్పటికప్పుడు శుభ్రపరచాలని, నీటిలో ఉండే మినరల్స్ ప్రమాణాలకు తగినట్లుగా ఉండాలని హెచ్చరించారు.

అనుమతులు తప్పనిసరి..

కృత్రిమంగా తయారు చేసి అమ్ముతున్న పండ్ల రసాలు, జ్యూస్ పాయింట్లకు ఫుడ్, బేవరేజెస్ అనుమతులు తప్పనిసరిగా ఉండాలని వైద్య ఆరోగ్య శాఖ అధికారులు తెలిపారు. కృత్రిమంగా తయారు చేసే పానియాల్లో వాడే రంగులు, నీటిలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సూచించారు. ఈ సందర్భంగా పండ్ల రసాల నమూనాలను సేకరించారు. కార్యక్రమంలో డీపీఎంఓ సత్యనారాయణ, హెల్త్ సూపర్‌వైజర్ రాంప్రసాద్, ల్యాబ్ టెక్నీషియన్ గోపి తదితరులు పాల్గొన్నారు.

స్కానింగ్ సెంటర్ ఏర్పాటు చేయాలి

గుండాల: మారుమూల గిరిజన ప్రాంతమైన గుండాల మండల కేంద్రంలో గర్భిణులకు స్కానింగ్ సెంటర్ ఏర్పాటు చేయాలని నవ చైతన్య యువజన సంఘం సభ్యులు ఆజాద్ డిమాండ్ చేశారు. సంఘం ఆధ్వర్యంలో బుధవారం గుండాలలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావును కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గర్భిణులు మండలం నుంచి పట్టణ కేంద్రాలకు వెళ్లాలంటే సుమారు 60 నుంచి 100 కి.మీ. ప్రయాణం చేయాల్సి వస్తోందని, స్కానింగ్ తీయడంలో జాప్యం జరిగితే మరోరోజు వెళ్లాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. పీహెచ్‌సీలో పోస్టుమార్టం సెంటర్ కూడా లేదన్నారు. ఇద్దరు వైద్యాధికారులను నియమించాలని, ఆస్పత్రిలో ఎక్స్‌రే సౌకర్యం కల్పించాలని కోరారు. వినతిపత్రం అందించినవారిలో నగేశ్, వినయ్, వెంకన్న, శ్రీధర్, ఉదయ్, సంతోష్ ఉన్నారు.



తుమ్మలకు వినతిపత్రం అందిస్తున్న సభ్యులు

శాంతి భద్రతల పరిరక్షణకే ఫ్లాగ్‌మార్చ్



ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్న పోలీసులు, సాయుధ బలగాలు

భద్రాచలంఅర్బన్: శాంతిభద్రతల పరిరక్షణకే ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్నట్లు భద్రాచలం టౌన్ సీఐ సంజీవరావు పేర్కొన్నారు. పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా బుధవారం సాయంత్రం భద్రాచలంటౌన్ పోలీసులు, కేంద్ర సాయుధ బలగాలు.. ఏఎస్పీ కార్యాలయం నుంచి ఆర్డీఓ కార్యాలయం, బ్రిడ్జి సెంటర్, బస్టాండ్ సెంటర్, అంబేడ్కర్‌సెంటర్, పాత మార్కెట్, బ్యాంక్ స్ట్రీట్, యూబీ రోడ్డు మీదగా ఏఎస్పీ కార్యాలయం వరకు ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. సీఐ సంజీవరావు మాట్లాడుతూ ప్రజలు స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకోవాలని, యువత వాట్సాప్‌లో రెచ్చగొట్టే పోస్టులు పెట్టొద్దని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్‌ఐలు పీవీఎన్ రావు, విజయలక్ష్మి, మధుప్రసాద్ పాల్గొన్నారు.